సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 7 । జనవరి । 2025



ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

జిల్లాలో ఆరోగ్య శ్రీ సేవలతో పాటు ఉద్యోగ ఆరోగ్య పథకానికి కూడా సోమవారం కొంత వరకు బ్రేక్ పడింది. 8లో



సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖ పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. 8లో



ఓవరాల్ చాంప్ సింహాచలం బీసీ గురుకుల పాఠశాల 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మంగళ, బుధవారాల్లో విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్ రామసింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కేంద్రంగా వర్చువల్ పద్ధతిలో జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈపీడీసీఎల్ పరిధిలోని ప్రజలు పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లను సంస్థ ఇప్పటికే పూర్తి చేసిందన్నారు. ఆసక్తి గలవారు తమ సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజినీరు (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించి ఏపీఈఆర్సీ అనుమతితో పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని http://eliveevents.com/apercpublichearing వెబ్‌లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.94 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడచిన 28 రోజులకు గాను కోటీ 94 లక్షల 40 వేల 202 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 46.100 గ్రాముల బంగారం, 9.530 కిలోల వెండి లభించిందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సింహాచలం టికెట్ల విక్రయాలు



భక్తులకు టిక్కెట్లు అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శన ప్రత్యేక టికెట్ల (రూ.500) విక్రయాలను దేవస్థానం అధికారులు సోమవారం ప్రారంభించారు. సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో టిక్కెట్లను అందుబాటులో ఉంచారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌లు పలాస ప్రాంతానికి చెందిన పలువురు భక్తులకు తొలి టిక్కెట్లను విక్రయించారు. 9వ తేదీ వరకు పీఆర్వో కార్యాలయంలో టిక్కెట్ల విక్రయాలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో www.aptemples.ap.gov.inలో టిక్కెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

మహిళా కానిస్టేబుల్ పరీక్షలకు 342 మంది హాజరు



పరుగు పోటీలో అభ్యర్థులు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లా కానిస్టేబుళ్ల నియామక పరీక్షల్లో భాగంగా కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో జరుగుతున్న శరీర దారుఢ్య పరీక్షలకు సోమవారం 342 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. 376 మంది గైర్హాజరయ్యారు. హాజరైనవారిలో తదుపరి పరీక్షకు 220 మంది అర్హత సాధించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

శారీరక దారుఢ్య పరీక్షలు వాయిదా

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈనెల 8వ తేదీన నిర్వహించాల్సిన శారీరక దారుఢ్య పరీక్షలు ఈనెల 11వ తేదీకి వాయిదా పడినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ నెల 8న ప్రధాని పర్యటనతో పాటు నగరంలో శాంతి భద్రతల దృష్ట్యా శారీరక దారుఢ్య పరీక్ష ఈనెల 11కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

అక్కడ దించేశారు.. ఇక్కడ లోడెత్తారు!



విశాఖ పోర్టు నుంచి మరో 10,600 టన్నుల రేషన్ బియ్యం ఎగుమతికి రెడీ

- కూటమి ప్రభుత్వ నేతల కనుసన్నల్లోనే లోడింగ్
- కాకినాడలో 1,320 టన్నులు దించినట్లు ప్రకటన
- అదే సమయంలో దొడ్డిదారిలో వేల టన్నులు విశాఖ నుంచి తరలింపు
- టీడీపీకి చెందిన వ్యాపారి కంటైనర్ల ద్వారా లోడింగ్
- రెండ్రోజుల్లో షిప్‌ని చైనా పంపించేందుకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : డైవర్షన్ పాలి'ట్రిక్స్'లో ఆరితేరిన కూటమి ప్రభుత్వం తన అస్మదీయుల పనులను చాపకింద నీరులా చక్కబెట్టుకోవడంలోనూ అదే పంథా అవలంబిస్తోంది. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమంగా తరలించేస్తున్నారంటూ గత నెలలో నానాయాగీ చేసిన ప్రభుత్వ పెద్దలు.. మరోవైపు విశాఖపట్నం పోర్టు నుంచి వేల టన్నుల బియ్యాన్ని దొడ్డిదారిలో దగ్గరుండి మరీ తరలించేస్తున్నారు. అక్కడేమో.. సీజ్ ద షిప్ అని గట్టిగా దబాయించి.. ఇక్కడేమో 'స్టార్ట్ ద షిప్' అంటూ గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణా చేసేస్తున్నారు. ఇందులో భాగంగా టీడీపీకి చెందిన వ్యాపారి ఫ్రైట్ స్టేషన్ నుంచి 10,600 టన్నుల రేషన్ బియ్యం చైనా షిప్పు ఎక్కింది. రెండ్రోజుల్లో వైజాగ్ నుంచి తరలిపోవడానికి లంగరు తీయనున్నారు.

అక్రమ రవాణా వెనుక కూటమి సర్కారు..!

వాస్తవానికి.. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందంటూ సీఎం చంద్రబాబు దగ్గర నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వరకూ అందరూ వైఎస్సార్‌సీపీపై ఇష్టారాజ్యంగా నిందలు వేశారు. తప్పు జరగకుండా కాపాడుతున్నామని తెగ బిల్డప్ ఇచ్చారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పేదోడి బియ్యం అక్రమ రవాణా వెనుక కూటమి ప్రభుత్వమే ఉందన్నది విస్పష్టమవుతోంది. కాకినాడ పోర్టులో 1,320 టన్నుల బియ్యాన్ని ఇటీవల పట్టుకున్నారు.

ఆ లోడంతా నెలరోజులకు పైగా కార్గో షిప్‌లోనే ఉంచేశారు. ఇటీవల ఆ బియ్యాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకుండా తమ ప్రభుత్వం గొప్ప చర్యలు చేపట్టిందంటూ అను'కుల' మీడియా ద్వారా ప్రజల్ని మభ్యపెట్టింది. మరోవైపు.. విశాఖపట్నం పోర్టు నుంచి వేల టన్నుల బియ్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లుచేసుకున్నారు.

మంత్రి వ్యూహాత్మక తనిఖీలు

విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)కు అనుబంధంగా విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (వీసీటీపీఎల్) నడుస్తోంది. కంటైనర్ కార్గో అంతా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు ఎగుమతి దిగుమతులు జరుగుతాయి. దీనికి సంబంధించి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు (సీఎఫ్ఎస్) ఉన్నాయి. వీసీటీపీఎల్ ఆధ్వర్యంలో ఒక సీఎఫ్ఎస్ నడుస్తోంది. దీనిపక్కనే మరో మూడు సీఎఫ్ఎస్‌లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వివిధ దేశాలకు పంపించాల్సిన కార్గోని కస్టమ్స్ హౌస్ బ్రోకర్ సంస్థలు అన్ని అనుమతుల్ని తీసుకుని కస్టమ్స్ నుంచి క్లియరెన్స్ వచ్చాక సీఎఫ్ఎస్‌కు తీసుకొస్తాయి. సీఎఫ్ఎస్ వాటిని గోదాముల్లో నిల్వఉంచి.. కంటైనర్లలో లోడ్‌చేసి, కంటైనర్ టెర్మినల్ ఆధ్వర్యంలో ఆయా దేశాలకు చెందిన కార్గోషిప్‌లలో చేరుస్తారు. ఇక అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యాపారి సీఎఫ్ఎస్ నుంచి వేల టన్నుల బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా చైనాకు పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత నెల 9న మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యూహాత్మకంగా ఈ సీఎఫ్ఎస్ మినహా.. మిగిలిన చోట్ల తనిఖీలు చేశారు. సదరు టీడీపీకి చెందిన వ్యాపారి సీఎఫ్ఎస్‌కు వెళ్లకుండా అక్కడున్న బియ్యాన్ని దశలవారీగా ఎగుమతి చేసేందుకు పరోక్షంగా సాయమందించారు. ఆ తర్వాత 60 కంటైనర్లలో బియ్యం లోడ్‌చేసి వ్యాన్‌హై–367 షిప్‌లో ఈనెల 12న అర్ధరాత్రి వేళ చైనాకు పంపించేశారు.

మరో 10,600 టన్నుల బియ్యం రెడీ

టీడీపీకి చెందిన వ్యాపారి సీఎఫ్ఎస్‌లో ఎలాంటి ఆటంకాలు లేకపోవడంతో.. కార్గో బ్రోకర్స్ కంపెనీలన్నీ ఇక్కడి నుంచే రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా దేశాలు దాటించేస్తున్నాయి. గత నెల 12వ తేదీన 60 కంటైనర్లలో బియ్యం పంపించిన వ్యాపార సంస్థ.. ఇప్పుడు మళ్లీ మరో 10,600 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని పంపించేందుకు 20 కంటైనర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే రేషన్ బియ్యాన్ని వాటిల్లో లోడ్ చేసేశారనీ.. రెండ్రోజుల్లో చైనా నుంచి షిప్ రాగానే వాటిని పంపించేందుకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు తెలిసింది. ఈ బియ్యం అక్రమ రవాణా వెనుక జిల్లా పౌర సరఫరా అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే.. అదంతా రేషన్ బియ్యం కాదని కొందరు అధికారులు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సమాచారం.



జిల్లా ఓటర్లు 20,15,934

- స్వల్పంగా పెరిగిన మహిళా ఓటర్లు
- తుది ఓటర్ల జాబితా ప్రకటన



మహారాణిపేట : జిల్లాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. గత ముసాయిదాతో పోల్చి చూస్తే 1,698 మంది మహిళా ఓటర్లు పెరిగారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితాను జిల్లా యంత్రాంగం సోమవారం ప్రకటించింది. జిల్లాలో ముసాయిదా ప్రతిపాదిత ఓటర్లు 20,14,236 మంది ఉండేవారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు పూర్తి చేసిన తరువాత తుది జాబితాలో మొత్తం 20,15,934 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 9,94,365 మంది, మహిళలు 10,21,450 మంది, థర్డ్ జెండర్ 119 మంది ఓటర్లు ఉన్నారు.

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
భీమిలి	1,78,834	1,85,744	15	3,64,593
తూర్పు	1,42,567	1,49,739	20	2,92,326
దక్షిణ	1,06,743	1,10,633	33	2,17,409
ఉత్తర	1,40,506	1,44,696	22	2,85,224
పశ్చిమ	1,05,279	1,08,423	12	2,13,714
గాజువాక	1,67,377	1,66,766	12	3,34,155
పెందుర్తి	1,53,059	1,55,449	05	3,08,513
మొత్తం	9,94,365	10,21,450	119	20,15,934

తహసీల్దార్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

- ముదపాక రెవెన్యూ సదస్సులో 198 అర్జీలు
- 90 శాతం ఫిర్యాదులు రెవెన్యూ తహసీల్దార్ పైనే..



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: 'గత నాలుగు దశాబ్దాలుగా మా గ్రామంలోని డీ–ఫారం భూముల్లో ఫలసాయం పొందుతూ జీవనం సాగిస్తున్నాం. కొన్నాళ్ల క్రితం రెవెన్యూ అధికారులు మమ్మల్ని మభ్యపెట్టి మా భూములను మాకు కాకుండా చేశారు. సర్వే నెంబర్ 1,66, 76, 80, 82, 83లలో ఉన్న మా భూములను దళారులకు కోల్పోయాం. మా భూములు తీసుకున్నందుకు ఎకరాకు 900 గజాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదు. దీనిపై మేం కోర్టులను ఆశ్రయించినా తహసీల్దార్ ఆనంద్‌కుమార్ నివేదికలు తప్పుగా ఇచ్చి కోర్టులనే తప్పుదోవ పట్టించారు. మాకు తగిన న్యాయం చేయాలి' అని పెందుర్తి మండలం ముదపాక రైతులు విన్నవించారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 198 వినతులు రాగా అందులో తహసీల్దార్ పైనే 152 ఫిర్యాదులు వచ్చాయి. ల్యాండ్ పూలింగ్ సమయంలో ఆనంద్‌కుమార్ దళారులకు సహకారం అందించారని ఆరోపించారు. తహసీల్దార్‌పైన ఆరోపణలు చేస్తూ ఆయనకే ఫిర్యాదులు చేయడం స్థానికంగా కలకలం రేగింది. కాగా రైతులు అందించిన అర్జీలను తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కదం తొక్కిన స్టీల్‌ప్లాంట్ కార్మికులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

పెండింగ్ జీతాల కోసం ఆందోళన

మహారాణిపేట: సమస్యల సాధన కోసం స్టీల్‌ప్లాంట్ కార్మికులు కదం తొక్కారు. కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న వారు, సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు నగరం నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు భారీ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉద్యోగులకు నాలుగు నెలల బకాయి జీతం వెంటనే చెల్లించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేసి మూడేళ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దాదాపు 20 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మరణంలోనూ కంటి వెలుగై..

- మరణించిన తండ్రి నేత్రాలను దానం చేసిన కుమారులు
- చింతలగ్రహారంలో ఆదర్శంగా నిలిచిన యువకులు



తండ్రి నేత్రదానానికి అంగీకారపత్రం అందిస్తున్న కుమారులు సత్యప్రసాద్, సంతోష్‌కుమార్

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన తండ్రి నేత్రాలను దానం చేసి.. కుమారులు ఆదర్శంగా నిలిచారు. పెందుర్తి మండలం చింతలగ్రహారానికి చెందిన శెట్టి పైడికొండ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మరణించాడు. ఈ క్రమంలో పైడికొండ కుమారులు సత్యప్రసాద్, సంతోష్‌కుమార్‌ల చిన్ననాటి స్నేహితుడు, సాయి హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ అక్కడికి చేరుకుని వారిని ఓదార్చారు. పైడికొండ నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరికి చూపు వస్తుందని వారికి చెప్పారు. దీంతో వెంటనే స్పందించిన ప్రసాద్, సంతోష్‌లు తండ్రి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. అక్కడికి చేరుకున్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వి.బాలామణి, డాక్టర్ డి.కనకమహాలక్ష్మిలు పైడికొండ నేత్రాలను సేకరించి ఆస్పత్రికి తరలించారు. నేత్రదానంపై శ్రీనివాస్ చొరవను, పైడికొండ కుమారుల సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు.

రైళ్లు ఫుల్

మొదలైన పండగ తాకిడి

- హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే రైళ్లలో 14 వరకు బెర్తులు రిజర్వ్
- 16 నుంచి 22 వరకు విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో రిగ్రెట్
- చాంతాడంత నిరీక్షణ జాబితాలు



సాధారణ భోగీల వద్ద పేద, మధ్య తరగతి ప్రయాణికుల పరిస్థితి

తాటిచెట్లపాలెం: సంక్రాంతి పండగ సందడి మొదలైంది. నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసేవాళ్లు, చదువుకునే విద్యార్థులు సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో ముందస్తు ప్రణాళికతో రిజర్వేషన్లు చేసుకున్నవారు కొద్దిమందే. పండగ దగ్గరపడుతుండగా ఊరెళ్లేందుకు సన్నాహాలు చేసుకునేవారే అధికంగా ఉంటారు. ఇటువంటి వారికి ఇప్పుడు రైళ్లలో బెర్తులు దొరికే పరిస్థితి లేదు. హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే రైళ్లలో ఈనెల 13వ తేదీ వరకు, ఇక పండగ తర్వాత ఇటు నుంచి వెళ్లే రైళ్లకు చాంతాడంత నిరీక్షణ జాబితా ఉంది. విశాఖపట్నం నుంచి/మీదుగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న రెగ్యులర్ రైళ్లతో పాటు పలు ప్రత్యేక రైళ్లలో నిరీక్షణ జాబితా పరిమితి దాటిపోయి టికెట్ బుకింగ్స్‌కు అవకాశం లేదని (రిగ్రెట్) చూపిస్తోంది. దీంతో పండగకు ఊరెళ్లేందుకు రైళ్లలో ఒక్క బెర్తయినా దొరికే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. జనవరి 13న భోగి, 14న సంక్రాంతి నేపథ్యంలో.. 11, 12, 13 తేదీల్లో సొంతూళ్లకు వెళ్లేవారు ఎక్కువగా ఉన్నారు. ఆ తేదీల్లో స్లీపర్ క్లాస్‌తోపాటు, థర్డ్ ఏసీలో సైతం బెర్తులు ఖాళీల్లేవు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సు ఛార్జీల ధరలు అత్యధికంగా ఉండటంతో ఎక్కువ మంది రైళ్లలోనే వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కానీ చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ టికెట్ కూడా జారీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. తిరుగు ప్రయాణంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు విశాఖ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే రైళ్లలో ఈనెల 22వ తేదీ వరకు వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది.

అదనపు రైళ్లు ఏవీ?

సాధారణ, మధ్యతరగతి ప్రజలు రైలు ప్రయాణానికే మొగ్గుచూపుతారు. సంక్రాంతి పండక్కి రెగ్యులర్ రైళ్ల బెర్తులు ఎప్పుడో ఫుల్ కాగా.. ప్రత్యేకంగా ఎటువంటి రైళ్లు వేయలేదు. గతంలో నడుస్తున్న వాటినే పొడిగించారు. వీటికి కూడా దాదాపు 60 రోజుల ముందే రిజర్వేషన్లు పూర్తయిపోయాయి. కొన్ని ప్రత్యేక రైళ్లు దువ్వాడ మీదుగా తరలిపోవడంతో నగరవాసులకు నిరాశే ఎదురవుతోంది. మొత్తానికి ఈ సంక్రాంతికి రైలు ప్రయాణం మధ్య తరగతి ప్రయాణికులకు ప్రహసనంగా మారనుంది.

సికింద్రాబాద్ నుంచి విశాఖకు 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రిజర్వేషన్ పరిస్థితి

కోణార్క్ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
జన్మభూమి ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
విశాఖ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
గోదావరి ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్

చెన్నై నుంచి విశాఖకు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రిజర్వేషన్

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్	రిగ్రెట్
హౌరా మెయిల్	రిగ్రెట్

బెంగళూరు నుంచి విశాఖకు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రిజర్వేషన్

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్	వెయిటింగ్ లిస్ట్ 100పైనే
హౌరా ఎక్స్‌ప్రెస్	వెయిటింగ్ లిస్ట్ 198పైనే

ప్రధాని పర్యటన విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మహారాణిపేట: ప్రధాని మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ప్రధాని ఈ నెల 8న విశాఖ రానున్న నేపథ్యంలో సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులతో సర్క్యూట్ హౌస్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయేలా చేద్దామన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ప్రధాని శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విప్‌లు పి.గణబాబు, చిరంజీవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు, రేపు డ్రోన్ల వినియోగంపై నిషేధం

విశాఖ సిటీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగాన్ని నిషేధించారు. ఈ మేరకు నగర పోలీసులు డ్రోన్ కెమెరాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మంగళ, బుధవారాల్లో ప్రధాని సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం వద్దే కాకుండా ఆయన పర్యటించే పరిసర ప్రాంతాలకు 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్ కెమెరాలను ఎటువంటి పరిస్థితుల్లో కూడా వినియోగించరాదని స్పష్టం చేశారు. వినియోగిస్తే వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంధుల ఫుట్‌బాల్ పోటీలో ఏపీ విజయం


విజయం సాధించిన ఏపీ జట్టు

విశాఖ స్పోర్ట్స్: తొలిసారిగా నిర్వహించిన అంధుల ఫుట్‌బాట్ పోటీలో ఏపీ జట్టు విజయం సాధించింది. ఒడిశాతో సోమవారం ఈ పోటీ నేత్ర విద్యాలయ గ్రౌండ్‌లో జరిగింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేసి సమవుజ్జీగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. జట్టు కెప్టెన్‌గా సూర్య రోహిత్, కోచ్‌గా సృజన్ వ్యవహరించారు. అతిథులు సోమేష్, శిరీషా, ఉదయ్‌కుమార్ ఏపీ జట్టును పరిచయం చేసుకున్నారు.

విజయవంతంగా మార్గశిర మాసోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శోభారాణి

దాబాగార్డెన్స్: నెల రోజులు నిర్వహించిన కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాల విజయవంతంలో జీవీఎంసీ, పోలీస్, విద్యుత్, దేవదాయ ధర్మదాయ శాఖ.. ఇలా సహకరించిన అన్ని విభాగాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణం అనుకూలించక చిన్నచిన్న అవాంతరాలు ఎదురైనా గతేడాది కన్నా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించగలిగామన్నారు. ఉత్సవాల్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు అరసవల్లి, అన్నవరం, ద్వారకాతిరుమల పలు దేవాలయాల నుంచి డిప్యూటేషన్‌పై సిబ్బంది సేవలందించారన్నారు. మార్గశిర మాసోత్సవాల హుండీ ఆదాయం గతేడాది రూ.4,86,46,924 రాగా, ఈ ఏడాది రూ.5,32,63,560 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు, కేఎస్ఎన్ మూర్తి, కె.సూర్యారావు, కె.తిరుపతిరావు, ఎంపీ రమణ, వద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలకు బ్రేక్



- కొత్త ఓపీ, ఈహెచ్ఎస్‌లు నిలుపుదల
- ప్రైవేటు ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడమే కారణం

మహారాణిపేట: అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలపై కత్తి కట్టింది. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడున్న సంక్షేమ పథకాలను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించడం.. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపి రాష్ట్ర ఖజానాను నింపుకుంటున్న కూటమి ప్రభుత్వం.. పేదలు, ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యాలతో మాత్రం ఆటలాడుతోంది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆలోచనతో 2007, ఏప్రిల్ 1న పురుడు పోసుకొని లక్షల మంది పేదల ఆరోగ్యాలను నిలబెడుతున్న ఆరోగ్య శ్రీ పథకంపైనే కాకుండా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌పై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా పేద ప్రజలకు అందుతున్న ఆరోగ్య శ్రీ సేవలతో పాటు ఉద్యోగ ఆరోగ్య పథకానికి కూడా సోమవారం కొంత వరకు బ్రేక్ పడింది.

జిల్లాలో 70 ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ నెటవర్క్ పరిధిలో ఉన్నాయి. ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్న పేదలు ఈ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందుతున్నారు. అయితే ఈ చికిత్సలకు సంబంధించి ప్రభుత్వం ఆయా ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించ లేదు. దీంతో సోమవారం నుంచి నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీలో పలు సేవలను నిలిపివేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌లను సైతం అంగీకరించ లేదు. సోమవారం కొత్తగా ఎలాంటి అవుట్ పేషెంట్ (ఓపీ)లను స్వీకరించలేదు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)లో ఉద్యోగులకు వైద్య సేవలను నిలిపివేశారు. బకాయిల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో ప్రస్తుతానికి ఈ రెండు సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలుపుదల చేశారు. దీంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు, ఉద్యోగులకు వైద్యం అందకుండా పోయింది. ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తేనే గానీ ప్రైవేటు ఆస్పత్రులు వైద్యం అందించడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. పేదలు, ప్రభుత్వ ఉద్యోగాలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏడు నెలల్లోనే విశ్వరూపాన్ని చూపిస్తోంది. నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలు, మద్యం, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాను నింపుకోవడంపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం.. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే విషయంపై శ్రద్ధ పెట్టడం లేదనడానికి ఇదే నిదర్శనం.

ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ నియామకం


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం అభివృద్ధికి నూతన అడ్వైజరీ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు విమానాశ్రయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఎంపీ శ్రీభరత్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. పరిశ్రమలు, టూరిజం, టెక్నాలజీ రంగాలే లక్ష్యంగా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కమిటీలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను నియమించామన్నారు. చైర్మన్‌గా తాను, ప్రత్యామ్నాయ చైర్మన్‌గా పీజీవీఆర్ నాయుడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి, సభ్యులుగా పి.దుర్గారావు, మన్వింద్ర, జి.వెంకట కృష్ణ, కంచర్ల రాంప్రసాద్, జె.నాగేంద్ర, ప్రత్యేక ఆహ్వానితులుగా నరేష్, సీవీ ప్రద్యుమ్న, జి. మురళీకృష్ణ, జి.సంజన వ్యవహరిస్తారన్నారు. అంతర్జాతీయ కార్గో కార్యకలాపాలతో పాటు దుబాయ్, గోవా, పూణే విమానాలను పునఃప్రారంభించేందుకు కమిటీ కృషి చేస్తుందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. ముంబై, బెంగళూరు విమానాలు విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు.

నకిలీ పాస్‌తో ప్రవేశించబోయిన వ్యక్తికి జైలు

ఉక్కునగరం: నకిలీ పాస్‌తో స్టీల్‌ప్లాంట్‌లోకి ప్రవేశించబోయిన వ్యక్తికి జైలు శిక్ష విధించారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి...2018 సెప్టెంబర్ 11న నకిలీ పాస్‌తో గాజువాక బీసీ రోడ్డుకు చెందిన పాలవలస చంద్రశేఖర్ స్టీల్‌ప్లాంట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అనుమానం వచ్చి తనిఖీ చేశారు. అది నకిలీ పాసు అని తేలడంతో స్టీల్ ప్లాంట్ పోలీసులకు అప్పగించారు. అప్పటి నుంచి విచారణ జరుగుతుండగా సోమవారం గాజువాక అడిషనల్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి మూడు నెలల జైలు శిక్ష లేదా రూ. 10 వేలు జరిమానా చెల్లించాలని ఆదేశించినట్టు స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తెలిపారు.

ప్రధాని పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు

విశాఖ సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖ పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. బహిరంగ సభతో పాటు రోడ్ షో ఉండడంతో అందుకు తగ్గ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ఈ సభకు భారీ స్థాయిలో జనం వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో భద్రత దృష్ట్యా పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధిస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో సభా ప్రాంగణం, రోడ్ షో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నందున మద్దిలపాలెం ఆర్చ్ నుంచి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వైపు రాకపోకలు, పోలమాంబ గుడి నుంచి ద్రోణంరాజు సర్కిల్, అక్కడి నుంచి దత్ ఐలాండ్ వరకు సోమవారం నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

రోడ్ షో ఇలా..

- వెంకటాద్రి వంటిల్లు జంక్షన్ నుంచి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ జంక్షన్ మీదుగా సభా స్థలం వరకు రోడ్డు షో జరగనుంది.
- ఎడమ వైపు రోడ్డును వీవీఐపీలకు, కుడి వైపు రోడ్డును ప్రజలకు కేటాయించారు.
- సీఆర్ రెడ్డి సర్కిల్ (సిరిపురం పెట్రోల్ బంక్), ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీసు, పోలమాంబ గుడి వైపుల నుంచి రోడ్ షోకు ప్రజలను కాలినడకన మాత్రమే అనుమతిస్తారు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 600 బస్సుల్లో..

విశాఖలో అన్ని నియోజకవర్గాల నుంచే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను మోదీ సభకు తరలిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి 200 బస్సులు, విజయనగరం, పార్వతీపురం నుంచి 400 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సులు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి తిమ్మాపురం బీచ్ రోడ్డులో ప్రయాణించి వాల్తేరు కురుపాం జంక్షన్‌కు చేరుకోవాలి. అక్కడ కుడివైపు తిరిగి పోలమాంబ గుడి మీదుగా ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ సమత హాస్టల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లోను, న్యూటన్ హాస్టల్ ఉన్న పార్కింగ్ ప్రాంతానికి చేరుకొని ప్రజలను దించి అక్కడే పార్కింగ్ చేసుకోవాలి.

పార్కింగ్ ఇక్కడే..

- అలాగే బైక్‌లపై వచ్చే వారు సీఆర్‌రెడ్డి సర్కిల్ వద్ద ఉన్న వీఎంఆర్‌డీఏ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌లో వాహనాలు నిలపాలి.
- వీవీఐపీల వాహనాలను హెలీప్యాడ్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీలకు ప్రత్యేక రూట్ కేటాయించారు. నోవోటెల్, ప్రభుత్వ అతిథి గృహం నుంచి సెవెన్ హిల్స్ కుడి వైపునకు తిరిగి గొల్లలపాలెం జంక్షన్, ఆశీల్‌మెట్ట మీదుగా స్వర్ణభారతి స్టేడియం వద్ద వారికి కేటాయించిన బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రయాణించి మద్దిలపాలెం ఏయూ ఆర్చ్ ద్వారా లోపలకు చేరుకోవాలి. మీటింగ్ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఏయూ భాస్కర్ బాయ్స్ హాస్టల్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. త్రీటౌన్ జంక్షన్ నుంచి గానీ, రూరల్ ఎస్పీ బంగ్లా నుంచి గాని వీఐపీ వాహనాలకు అనుమతి లేదు.
- పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ, ఇతర అధికారులు వారి వాహనాలను హెలీప్యాడ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న మెరైన్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.

ట్రాఫిక్ మళ్లింపు

- ప్రముఖుల రాకపోకలతో రహదారి భద్రత దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. బుధవారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు శ్రీకాకుళం, విజయనగరం నుంచి విశాఖపట్నం మీదుగా అనకాపల్లి వైపు వెళ్లే అన్ని రకాల భారీ వాహనాలను ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లించనున్నారు. అదే విధంగా అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే అన్ని రకాల భారీ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా పంపించనున్నారు.
- బుధవారం ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు మద్దిలపాలెం, పెదవాల్తేరు కురుపాం సర్కిల్ నుంచి త్రీ టౌన్ పోలీ స్టేషన్ వైపు, స్వర్ణ భారతి నుంచి మద్దిలపాలెం వైపు, మద్దిపాలెం నుంచి పిఠాపురం, మంగాపురం కాలనీ వైపు ఎటువంటి సాధారణ వాహనాలకు అనుమతి లేదు.

ఓవరాల్ చాంప్ సింహాచలం బీసీ గురుకుల పాఠశాల


ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న సింహాచలం గురుకుల పాఠశాల విద్యార్థులు

సింహాచలం: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని విద్యా శాఖ ఆర్‌జేడీ బి.విజయ్ భాస్కర్ తెలిపారు. సింహాచలం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరిగిన జోనల్ స్థాయి (జోన్-1) స్పోర్ట్స్ మీట్ సోమవారంతో ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలోని 15 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సింహాచలం గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ భానుమతి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని పాల్గొన్నారు.

విజేతలు వీరే.. : ఓవరాల్ చాంపియన్ షిప్ విభాగంలో సింహాచలం బీసీ గురుకుల పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, శ్రీకాకుళం జిల్లా అంపోలు గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత చాంపియన్ షిప్ విభాగంలో అనకాపల్లి బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి కె.కుమార్ ప్రథమ స్థానం, సింహాచలం గురుకుల పాఠశాల విద్యార్థి ఎ.హరీష్ ద్వితీయ స్థానంలో నిలిచారు.

మత్స్య ఉత్పత్తులతో లాభసాటి వ్యాపారం

- విలువ ఆధారిత ఉత్పత్తులపై పరిశోధనలు
- ఈశాన్య రాష్ట్రాల అధికారులకు ఐదు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభం
- సీఐఎఫ్‌టీ డైరెక్టర్ డాక్టర్ జార్జ్ నీనన్


శిక్షణ తరగతుల వివరాలతో కూడిన సంచికను విడుదల చేస్తున్న డాక్టర్ జార్జ్ నీనన్ తదితరులు

ఏయూక్యాంపస్: లాభదాయక వ్యాపారాలుగా మత్స్య ఉత్పత్తులు నిలుస్తాయని కేంద్రీయ మత్స్య సాంకేతిక సంస్థ (సీఐఎఫ్‌టీ) డైరెక్టర్ డాక్టర్ జార్జ్ నీనన్ అన్నారు. సోమవారం బీచ్ రోడ్డులోని ఐసీఏఆర్-కేంద్రీయ మత్స్య సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో 'ఎన్‌హేన్సింగ్ నాలెడ్జ్ టెక్నాలజీ, ఫిష్ ప్రోసెసింగ్ అండ్ ఫుడ్ సేఫ్టీ ఫర్ ఫిషరీస్ అఫీషియల్స్ ఆఫ్ ది నార్త్ ఈస్టర్న్ హిల్ రీజియన్' శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. శిక్షణ తరగతులకు అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం రాష్ట్రాల నుంచి మత్స్యశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జార్జ్ నీనన్ మాట్లాడుతూ చేపల ప్రోసెసింగ్‌లో నూతన టెక్నాలజీలను వారికి వివరించారు. ఆరోగ్యానికి హాని చేయని విధానంలో స్మోక్ ఫిష్ తయారీకి తాము ప్రత్యేకమైన యంత్రాన్ని ప్రోటోటైప్‌లో తయారు చేశామన్నారు. దక్షిణాసియా దేశాలకు మన దేశ మత్స్య ఉత్పత్తులు ఎగుమతి చేయాలన్నారు. చేపలు పెంపకం, నిల్వ చేసే సమయంలో యాంటీబయోటిక్స్, రసాయనాలు వినియోగించకూడదన్నారు. వివిధ దేశాలలో విమానాశ్రయాల్లో మత్స్య సంబంధిత ఆహార స్టాల్స్ ఉంటాయని, తద్వారా వాటిని ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. మన దేశంలో ఈ తరహా విధానాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన మార్గదర్శక సంచికను విడుదల చేశారు. విశిష్ట అతిథి ఇండియన్ సీ ఫుడ్ ఎగుమతి సంఘం జాతీయ అధ్యక్షుడు జి.పవన్ కుమార్ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో రొయ్యల పెంపకం, ఎగుమతులపై దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటికే పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ఫిష్ ఆక్వాకల్చర్‌లో ఇప్పటికే ఈ రంగలో లాభాలను పొందుతున్నాయన్నారు. సీఐఎఫ్‌టీ చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి చేస్తున్న కృషిని అభినందించారు. కేంద్రం సైంటిస్ట్-ఇంచార్జ్ డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ 8 ఈశాన్య రాష్ట్రాల నుంచి 19 మంది అధికారులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొంటున్నారన్నారు. ఐదు రోజుల శిక్షణలో భాగంగా వీరికి బోధన, ప్రత్యక్ష ప్రయోగశాల తరగతులు ఉంటాయన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు కార్యక్రమ వివరాలు తెలియజేశారు. నాణ్యమైన, ఆరోగ్యకర ఆహారం అందించడం సదస్సు ఉద్దేశమన్నారు. ఫార్మాలిన్‌తో కలుషితం చేయడం, పాథోజెన్స్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సీఐఎఫ్‌టీ నుంచి అభివృద్ధి చేసిన సాంకేతికతలకు సంబంధించిన సర్టిఫికెట్లను ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జెస్మి డెబ్బర్మా, కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పోర్టు క్యాజువల్ కార్మికుల కల సాకారం


అతిథులతో పోర్టు కార్మికులు

సీతంపేట: పోర్టు క్యాజువల్ కార్మికుల 15 ఏళ్ల కల సాకారమైంది. క్యాజువల్ కార్మికులకు పోర్టులో ఉపాధి కల్పిస్తూ సంస్థ చైర్మన్ అంగముత్తు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నరసింహనగర్ రైతుబజార్ వద్ద సోమవారం కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆల్ ఇండియా పోర్టు అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు డీకే శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 347 మంది కార్మికులు తమ తల్లిదండ్రుల ఉద్యోగాలు పొంది ఎన్నో ఏళ్లుగా డీఎల్‌బీ, పోర్టు ట్రస్టులో సేవలందిస్తున్నారన్నారు. అయితే వారిని దినసరి కూలీలుగానే ఇంతవరకు పరిగణించారని, 15 ఏళ్ల తరువాత చైర్మన్ అంగముత్తు స్పందించి దినసరి నుంచి నెలసరి వేతనాలు చెల్లించడానికి అంగీకరించారని తెలిపారు. ఇక మీదట వారందరికీ పోర్టులో నిరంతరం ఉపాధి కల్పించడానికి ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో పోర్టు ట్రస్టీ అంజిబాబు, హెచ్ఎంఎస్ కోశాధికారి మంగయ్యానాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు, పోర్టు సలహా మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఉద్యమకారుడు గుండు అప్పలరాజు, బాలు, నాయుడు పాల్గొని చైర్మన్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్ జాయింట్ సెక్రటరీ కె.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై మంత్రి లోకేష్ వ్యాఖ్యలు సరికాదు


వలంటీర్ల సంఘం రాష్ట్ర నేత దీప్తి

సీతమ్మధార: గ్రామ, వార్డు వలంటీర్లు విధుల్లో లేరని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వలంటీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ జిల్లా అధ్యక్షురాలు దీప్తి ఖండించారు. ఈ మేరకు ఆమె ఒక వీడియా సందేశాన్ని సోమవారం మీడియాకు విడుదల చేశారు. వలంటీర్లకు రూ.5 వేలు నుంచి రూ10వేలు వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలిచ్చారని, ఇప్పుడు జీవో లేదని చెప్పడం తమను మోసగించడమేనన్నారు. ఎన్నికల ముందు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. వలంటీర్లపై మంత్రులు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని పట్టించుకోనవసరం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల ఆందోళనపై మంత్రులు ఫోకస్ చేస్తున్నారని గుర్తు చేశారు. వలంటీర్లంతా ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో వలంటీర్లు పస్తులు ఉండాల్సి పరిస్థితి ఏర్పడిందని, ఈ పాపం కూటమిదేనన్నారు. వలంటీర్ల తొలిపోరు విజయవంతమైందని, పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.



• పేదల షాపింగ్ మాల్..!

పేద, మధ్య తరగతి వస్త్ర ప్రేమికులకు పోలీస్ బ్యారెక్స్ వద్ద ఉన్న దుకాణాలే షాపింగ్ మాల్స్. ఇక్కడ సామాన్యులకు అందుబాటు ధరల్లో దుస్తులు లభ్యమవుతాయి. ఇక్కడ ఉన్నన్ని వెరైటీలు పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో కూడా లభించవు. సంక్రాంతికి ఇంకా వారం రోజులు ఉండడంతో దుస్తుల విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. పేదల బజార్‌గా పేరుగాంచిన ఈ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.

–ఏయూక్యాంపస్